


## పొలాల్లో పాముల సంచారం.....
# రైతుల అప్రమత్తం
రైతు లు, కూలీలు తగు జాగ్రత్త లు తీసుకోవాలి.

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

30 ఆదివారం ఆగస్టు, 2026 పేజీలు:11







## అనుమతులు లేకుండా
# అదనపు అంతస్తులా?
## చర్యలు తప్పవు!




### జడ్చర్లలో అక్రమ నిర్మాణాలపై మున్సిపాలటీ కఠిన నిఘా

- అనుమతులు లేని నిర్మాణాలను గుర్తిస్తున్నాం
- చట్టప్రకారం కూల్చివేతలు తప్పవు
- ప్రజలు సహకరించాలి.. అక్రమ నిర్మాణాలను అరికట్టేండి

**జడ్చర్ల/మహబూబ్ నగర్ ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, భవనాలను అనధికారికంగా విస్తరించడం వంటి చర్యలకు ఇకపై అడ్డుకట్ట వేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. నిబంధనలను ఉల్లంఘించే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మించిన భవనాలకు అదనపు అంతస్తులు నిర్మించాలన్నా, భవనంలో మార్పులు లేదా విస్తరణలు చేపట్టాలన్నా ముందుగా మున్సిపాలిటీ నుంచి సంబంధిత అనుమతులు తప్పనిసరిగా పొందాలని అధికారులు సూచించారు. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడితే వాటిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిగతా 2 లో

# అనుమతులు లేకుండా అదనపు అంతస్తులా? చర్యలు తప్పవు!

మొదటిపేజీ తరువాయి

### అక్రమ నిర్మాణాల గుర్తింపునకు ప్రత్యేక బృందాలు:

జడ్చర్ల పట్టణంలో అనధికార నిర్మాణాలను గుర్తించి నియంత్రించేందుకు ప్రత్యేక మున్సిపల్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించిన సందర్భంలో సంబంధిత చట్టాలు, మున్సిపల్ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయడంతో పాటు నిర్మాణ పనులను నిలిపివేయడం, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

### పత్రాలు సిద్ధంగా ఉంచాలి:

మున్సిపల్ అధికారులు లేదా ప్రత్యేక బృందాలు తనిఖీలకు వచ్చినప్పుడు భవన యజమానులు బిల్డింగ్ పర్మిషన్, ఆమోదిత బిల్డింగ్ ప్లాన్, అనుమతి పత్రాలు, పన్ను/ఆస్తికి సంబంధించిన పత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిర్మాణానికి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నట్లయితే వాటిని అధికారుల పరిశీలనకు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.నిర్మాణానికి సంబంధించిన వాస్తవ వివరాలను దాచడం, అవసరమైన పత్రాలను సమర్పించకుండా తనిఖీలకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని అధికారులు హెచ్చరించారు.

### అనుమతే రక్షణ.. నిబంధనలే ప్రమాణం

ప్రజలు ఎలాంటి ఇబ్బందులు, చట్టపరమైన చర్యలకు గురికాకుండా నిర్మాణ పనులు ప్రారంభించే ముందే మున్సిపల్ అనుమతులు పొందాలని జడ్చర్ల మున్సిపాలిటీ విజ్ఞప్తి చేసింది.“అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టవద్దు.. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టి మున్సిపాలిటీకి సహకరించండి” అని అధికారులు ప్రజలకు సూచించారు.

# పొలాల్లో పాముల సంచారం - రైతుల అప్రమత్తం

## రైతు లు, కూలీలు తగు జాగ్రత్త లు తీసుకోవాలి.

మొదటిపేజీ తరువాయి

**మహమ్మదాబాద్ ఆగస్టు 29( ప్రజా జ్యోతి)**

మహమ్మదాబాద్ మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు గడ్డివాముల దగ్గర పాముల సంచరించే అవకాశం ఉంటుంది కాబట్టి రైతులు అప్రమత్తంగా అధికారులు పలు సూచనలు చేస్తున్నారు గడ్డి పొదల్లో జాగ్రత్త పంట పొలాల వద్ద గడ్డివాములు మరియు ముల్ల ముళ్లపదల్లో పాములు దాక్కునే అవకాశం ఉంది కాబట్టి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాల్సి వస్తే రాత్రి వేళల్లో రైతులు పొలాలకు వెళ్లాల్సి వస్తే టార్చ్ లైట్ మరియు చేతిలో కర్ర చెప్పులు తప్పకుండా ధరించి పొలాలకు వెళ్లాలి బొరియల వద్ద (ఎలుకల కన్నా లు ) జాగ్రత్త బొర్యాల వద్ద రాళ్ల కుప్పల వద్ద రైతులు గడ్డివాముల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి.రైతులకు సూచనలు పాము కనిపించినట్లయితే పట్టుకోడానికి లేదా చంపడానికి సమయం వృధా చేయకండి, పాము కాటు కు గురైన వ్యక్తి కి నాటు వైద్యం, మంత్రం తంత్రం లాంటి వాటి పైన ఆధార పడకుండా ఆసుపత్రికి వెళ్ళి సరైన చికిత్స చేయించుకోవాలి

# జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యంతో

# ఏడు సంవత్సరాల పాప వైద్య మందక మృతి?

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 29( ప్రజా జ్యోతి)**







నారాయణపేట జిల్లా కేంద్రం నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్ రాములు కమ్మరి లక్ష్మి ల కూతురు చైత్ర వైద్యం కోసం వచ్చి మృతి చెందడంతో పాప బంధువులు టి యు సి ఐ కార్మిక సంఘం నాయకులు పెద్ద ఎత్తున జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు, విషయం తెలుసుకున్న స్థానిక రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు తెలుసుకొని తప్పకుండా బాధ్యతలు పైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు, మృతురాలి బంధువులు కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని వివరించడంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి అందుబాటులో ఎవరు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో బాలాజీ పిచ్చి బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా వారికి హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు, ఇలాంటి సంఘటనలు జిల్లా ఆస్పత్రిలో అనేక జరిగాయని 20 రోజుల కిందటే పాముకాటుతో సరైన వైద్య మందక బాలుడు మృతి చెందిన సంఘటన మరవక ముందే మళ్ళీ ఇలాంటి సంఘటన జరిగితే జిల్లా వైద్యాధికారు జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం ఏం చేస్తున్నారని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు, వైద్యం కోసం వస్తే ప్రాణాలు పోటుకోవాల్సిన దుస్థితి జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఉందని ఆందోళన చెందుతున్నారు, కార్మిక సంఘాల నాయకులు నరసింహ బోయినపల్లి రాము మాట్లాడుతూ, గతంలో ఇలాంటి సంఘటనలు జరిగైతే కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడంతోనే వారి నిర్లక్ష్యంతో ఈరోజు మరో పాప బలి కావాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు అన్నారు, ఈ రకంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బంది, మందులు లేకపోవడం ఎవరి నిర్లక్ష్యమని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేను జిల్లా కలెక్టర్ ను ప్రశ్నించారు, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా ప్రభుత్వ వైద్య ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులను, వైద్య సిబ్బంది నియమించాలని వారు డిమాండ్ చేశారు లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని, తెలిపారు,ఈరోజు మృతి చెందిన పాప కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారుల మీద చర్యలు తీసుకోవాలని ప్రజలు వారు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు

# నెట్టెంపాడు 100వ ప్యాకేజీ కోసం రైతుల గర్జన

## - పనులు పూర్తి చేసి నీరు అందించాలని రైతులుడిమాండ్

**గద్వాల (ప్రజాజ్యోతి )ఆగస్టు 29:**

ఏళ్లు గడుస్తున్నా నెట్టెంపాడు 100వ,ప్యాకేజీ పనులు నత్తనడకన సాగుతుండటంతో రైతన్నల సహనం నశించింది.కళ్లెదుటే నీరు కనిపిస్తున్నా కాలువలకు నీరు లేక పొలాలు ఎండుతుండటంతో జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల రైతులు రోడ్డెక్కారు.నెట్టెంపాడు 100వ,ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేసి తమకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన చేపట్టారు.ఇటిక్యాల మండల పరిధిలోని శనిగపల్లి,షాబాద్,ఉడండాపురం,పెద్దదిన్నె,చాగాపురం తదితర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని,ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని వారు మండిపడ్డారు.అసంపూర్తిగా కాలువలు అందని సాగునీరు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన 100వ,ప్యాకేజీ పనులు ఎక్కడికక్కడ అసంపూర్తిగా నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన కాలువలు తవ్వినా,పిల్ల కాలువల (డిస్ట్రిబ్యూటరీలు) నిర్మాణం జరగకపోవడంతో తమ పొలాలకు చుక్క నీరు కూడా రావడం లేదన్నారు.భారీగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు సాగునీరు లేక కళ్లముందే ఎండిపోతున్నాయని,దీంతో అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు మంజూరు చేయాలి.ప్రభుత్వం వెంటనే స్పందించి నెట్టెంపాడు 100వ, ప్యాకేజీ పెండింగ్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, యుద్ధప్రాతిపదికన కాలువల నిర్మాణం పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించాలని రైతులు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని,రాబోయే రోజుల్లో జిల్లా కలెక్టరేట్ ముట్టడికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు,పెద్ద సంఖ్యలో అన్నదాతలు పాల్గొన్నారు.



# ఆర్‌జేఆర్ హెర్బల్ క్లినిక్‌లో ఆకస్మిక తనిఖీ

## - నిబంధనల మేరకు ప్రైవేట్ వైద్య సంస్థలు నిర్వహించాలి

## డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జడ్చర్ల బస్టాండ్ సమీపంలోని ఆర్‌జేఆర్ హెర్బల్ క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు నిర్వహించాలని డీఎంహెచ్‌వో సూచించారు. వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, తద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆదేశించారు.క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలతో పాటు నిర్వహిస్తున్న రికార్డులను అధికారులు పరిశీలించారు. వైద్య సంస్థల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.తనిఖీలో ఎయిడ్స్, కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ ఏ. రాజు, డాక్టర్ పులి విద్య, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# బీచుపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం, తృటిలో తప్పిన పెను ముప్పు

## - డీసీఎం ఢీకొనడంతో కారుకు నష్టం,డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

**గద్వాల (ప్రజాజ్యోతి),ఆగస్టు 29:**

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి సమీపంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం. బీచుపల్లి వద్ద టర్నింగ్ తీసుకుంటున్న కారును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పింది.డీసీఎం ఢీకొనడంతో కారు కొంతమేర దెబ్బతిన్నట్లు సమాచారం.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు.పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.



# ఏఎస్ఐ కన్నయ్య మృతదేహానికి సరితా తిరుపతయ్య నివాళి

**గద్వాల ఆగస్టు 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీసీ కాలనీ ఎల్లప్ప గారి అన్న,ఏఎస్ఐ పోలీస్ కన్నయ్య తిరుమల తిరుపతి స్వామివారి దర్శనం అనంతరం గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్,తెలంగాణ రాష్ట్ర గొర్రెలు,మేకల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరితా తిరుపతయ్య,కన్నయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సరితా తిరుపతయ్య మాట్లాడుతూ,కన్నయ్య మృతి వారి కుటుంబానికి తీరని లోటని,ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,జిల్లా నాయకులు,పట్టణ నాయకులు,మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# భక్తులతో కిటకిటలాడిన పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం

- వైభవంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన,పీఠాధిపతుల ప్రత్యేక పూజలు

**గద్వాల ఆగస్టు 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

శ్రావణమాసం శ్రావణ శనివారం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.కర్ణాటకలోని రాయచూర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్,తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆంజనేయస్వామివారికి బ్రహ్మముహూర్తంలో మధు అభిషేకం,పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు.అనంతరం పుష్పార్చన, ఆకుపూజలు,తులసి పత్రాలతో నైవేద్యం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.మంత్రాలయ గురుమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాదీశతీర్థ శ్రీపాదుల వారు,శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారి ఆధ్వర్యంలో ఉడిపి వేద పండితులు,అర్చక బృందం శాస్త్రోక్తంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన,అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు.నిత్య హోమాల్లో భాగంగా భక్తులచే పవమాన హోమం, నవగ్రహ హోమాలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పించి,నైవేద్యాలు పెట్టి, ముడుపులు చెల్లించుకున్నారు.పీఠాధిపతులు భాగవతం,రామాయణంపై ప్రవచనాలు చేశారు.ఆలయ అర్చకులు భక్తుల వాహనాలకు ప్రత్యేక వాహన పూజలు నిర్వహించారు.పెద్ద చింతరేవుల ఆంజనేయ అన్న ప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారి,దేవాలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్వర శర్మ,ఆలయ సిబ్బంది,వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు,మహిళలు,చిన్నారులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.





# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ఆగస్టు 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ కాని,అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై శనివారం హైదరాబాద్ నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో మ్యాపింగ్ కాని,అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈఆర్వోలు,ఏఈఆర్వోలు ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు బూత్ లెవల్ అధికారులకు తరచూ దిశానిర్దేశం చేయాలని ముఖ్య ఎన్నికల అధికారి సూచించారు.గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని,ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి,తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.పోలింగ్ స్టేషన్,మండలాల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని,నోటీసుల పంపిణీ పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల,వివిధ మండలాల తహసీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపరచాలి

- సాధారణ కాన్పులు పెంచాలి.. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు ఆదేశం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహమ్మదాబాద్, గండీడ్, హన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా వ్యాక్సిన్ల నిల్వలు, మందుల నిల్వలు, రోగ నిర్ధారణ పరీక్షల సేవలు, సిబ్బంది హాజరు వివరాలు, ఆసుపత్రుల పరిశుభ్రతను డీఎంహెచ్‌వో పరిశీలించారు. వైద్య సేవలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందిస్తూ, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించాలని డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, రోగులకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ పులి విద్య, సుభాష్ చంద్రతో పాటు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

## - ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన






**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య, అభివృద్ధి, చికిత్స, సంక్షేమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి అవసరమైన సహాయం, చికిత్స, విద్యా సౌకర్యాలను అందించడం ద్వారా వారి సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడవచ్చున్నారు. పిల్లల విద్య, అభివృద్ధిలో తల్లిదండ్రులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ కలెక్టర్ సాయి శివాని, అపోలో ప్రీ-ఇంటర్వెన్షన్ స్పెషలిస్ట్ డాక్టర్ జగదీష్, సి ఎం ఓ సుధాకర్ రెడ్డితో పాటు ప్రత్యేక విద్యా నిపుణులు, సమగ్ర విద్యా వనరుల వ్యక్తులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిపుణులు తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడి పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించడం, సమ్మిళిత విద్య, అందుబాటులో ఉన్న సహాయక సేవలు, పాఠశాలలు, సంబంధిత కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపించడం, అవసరమైన చికిత్సలు అందించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను గుర్తించి, వాటిని వినియోగించుకునేలా తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేయడంలో ప్రత్యేక విద్యా నిపుణులు, సమగ్ర విద్యా వనరుల వ్యక్తుల పాత్రను అధికారులు అభినందించారు. విద్యాశాఖతో పాటు ఇతర శాఖలు, సంస్థలు అందిస్తున్న సహకారం, మార్గదర్శకత్వం పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తుకు అవసరమైన విద్య, చికిత్స, సంక్షేమ సేవలను అందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# హాకీ మాంత్రికుడి స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

## - జేపీఎన్‌సీఈలో ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన దిగ్గజ క్రీడాకారుడు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల (జేపీఎన్‌సీఈ) చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కృష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ.. మేజర్ ధ్యాన్‌చంద్ భారత హాకీకి విశ్వవ్యాప్త ఖ్యాతి తీసుకొచ్చిన మహోన్నత క్రీడాకారుడని కొనియాడారు. 1928, 1932, 1936 ఒలింపిక్ క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి, వరుసగా మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అద్భుతమైన బంతి నియంత్రణ, గోల్ సాధించే నైపుణ్యం, క్రమశిక్షణ, దేశభక్తితో ధ్యాన్‌చంద్ ప్రపంచ క్రీడాభిమానుల మన్ననలు పొందారని తెలిపారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించిందన్నారు. ధ్యాన్‌చంద్ జన్మదినమైన ఆగస్టు 29ను దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఈ. చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్ చెన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం

## - ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 29 (ప్రజా జ్యోతి)**

రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదనీ,ఇది పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవా నికి ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు.శనివారం తాడూర్ మండల కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు నిత్యావసరాల ను పంపిణీ చేసేందుకు రేషన్ షాపులను ఏర్పాటుచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఇందిరమ్మ రాజ్యంలో పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని,రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని,నేడు ప్రతిపక్ష నాయకులు సన్న బియ్యం,ఇందిరమ్మ ఇండ్లు,ఆరోగ్యశ్రీ వంటి పథకాలపై విమర్శలు చేస్తున్నారని,గతంలో అధికారంలో ఉన్న నాయకులు ప్రజా సంక్షేమానికి ఏం చేశారో ఆలోచన చేసుకోవాలని అన్నారు.అర్హులైన వారికి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంద మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్,ఎమ్మార్వో రామకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ రామచంద్రా రెడ్డి, మండల అధ్యక్షులు రమేష్,మార్కెట్ డైరెక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు



# శనేశ్వరాలయంలో తిలతైల అభిషేక పూజలు

## - పరమశివునికి రుద్రాభిషేకాలు

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 29(ప్రజా జ్యోతి)**

శ్రీ పరాభవ నామ సంవత్సరం శ్రావణ మాసం క్రిష్ణ పక్షం పాడ్యమి శనివారం పూర్వ భద్ర, ఉత్తర భద్ర నక్షత్రము నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలోని శ్రీ శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిల తైలాభిషేఖాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా ఆలయ అర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాని అన్నారు.అదేవిదంగా ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించిన అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం,తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో చైర్మన్ వెల్దండ గోపాల్ రావు,గ్రామ సర్పంచ్ సుగుణమ్మ,సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకరాచారి,పుల్లయ్య,వీర శేఖరాచారి,శ్రీకాంత్ రెడ్డి, శాంతి కుమార్,ఉమామహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.



# 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' పాదయాత్రకు గద్వాలలో ఘన సంఘీభావం

**గద్వాల ఆగస్టు 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఐక్య, సమ్మిళిత, ప్రగతిశీల భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' జాతీయ పాదయాత్రకు గద్వాలలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది,సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వరు,రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షతో, ఆయన దార్శనికతకు స్ఫూర్తి పొంది ఈ పాదయాత్రను చేపట్టారు.2026 జూన్ 19న కన్యాకుమారిలో ప్రారంభమైన ఈ యాత్ర,తమిళనాడు,కేరళ,కర్ణాటక రాష్ట్రాల మీదుగా ఇప్పటికే 1,400 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి గద్వాల నియోజకవర్గానికి చేరుకుంది.యాత్రలో భాగంగా ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకోవడంతో పాటు సమ్మిళిత అభివృద్ధి,ప్రజాస్వామ్య విలువలు,బలమైన భారతదేశ నిర్మాణం వంటి అంశాలపై ప్రజలతో నిర్వాహకులు సంభాషిస్తున్నారు.'ప్రజలతో మమేకం-సమ్మిళిత భారతదేశం కోసం పాదయాత్ర'అనే నినాదంతో ఈ యాత్ర కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,జిల్లా నాయకులు,మండల నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తాం.

## -- డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి.





**నారాయణపేట, ప్రతినిధి ఆగస్టు 29 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (సీవీఆర్ భవన్) జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఓబీసీ కమిటీల పునర్నిర్మాణం,పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఖాజజ పరిశీలకులు కోట్ల చంద్రయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు,ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింత అనుసంధానం చేసి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఓబీసీ కమిటీలను పునర్నిర్మించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.జిల్లా ఓబీసీ చైర్మన్‌తో పాటు మండల, టౌన్ ఓబీసీ అధ్యక్షుల నియామకాలు,మండల, గ్రామ,టౌన్ కమిటీల ఏర్పాటు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఓబీసీ కమిటీల పునర్నిర్మాణంపై సమీక్షించారు.పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ,అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులకు సూచించారు. జిల్లా,రాష్ట్రస్థాయి ఓబీసీ కమిటీలలో నియమించాల్సిన అర్హులైన నాయకుల పేర్లను సేకరించి పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదించాలని అన్నారు.పటిష్టమైన ఓబీసీ కమిటీల నిర్మాణం ద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షుడు కె. నరహరి, దామరగిద్ద మండల అధ్యక్షుడు బర్ల హన్మంతు,కృష్ణయ్య, సుభాష్ గౌడ్,జట్రం లక్ష్మయ్య గౌడ్,వెంకట్రాములు, రవికుమార్ చారి,బండి. అనంద్,తదితరులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగ ఉపాధ్యాయుల నిరసన

**కృష్ణా ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)**

టి జీ ఈ జేఏసీ తెలంగాణ రాష్ట్ర సంఘ పిలుపుమేరకు కృష్ణా మండలంలో నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పి ఆర్ సి, డి ఏ లు ప్రకటించకుండా మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ రద్దు 317 జీవో బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు నేటికీ న్యాయం చేయకపోవడాన్ని నిరసిస్తూ అదేవిధంగా మూడు నెలలు కావచ్చునా నేటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును సరిగ్గా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈరోజు కృష్ణ మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వై.జనార్ధన్ రెడ్డి,రాంగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పి ఆర్ సి, డి ఏ లు ప్రకటన, సి పి ఎస్ రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి,జేఏసీ కో చైర్మన్ యస్ టి యు జిల్లా అధ్యక్షులు రామ్ గోపాల్, రెవిన్యూ ఉద్యోగ సంఘం నాయకులు శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శులు మహేష్,రాజు పి అర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరేందర్, బాలరాజు , మాగనూర్ మండలం అధ్యక్షులు బలరాం కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్,గౌ.అధ్యక్షులు శివరాజ్ అసోసియేట్ అద్యక్షులు అనిల్ కుమార్, తాయప్ప,డిటీయఫ్ నాయకులు అశోక్ నర్సింహా,శంక్రప్ప,వీరేష్, ఉపాధ్యాయులు సహీన్,లక్ష్మీదేవి,రంగారావు,గీత,షబానా,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు




# శ్రీ స్వయంభూ తిమ్మప్ప స్వామి దేవాలయంలో గంప జాతర

**మల్దకల్ ఆగస్టు 29(ప్రజా జ్యోతి):**

ఆది శిలాక్షేత్రం శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో దేవరగట్టుకు వెళ్లి పూజలు నిర్వహించి దశమికట్ట వరకు ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ ద్వారా గంప జాతర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి,ఆలయ అర్చకుడు జ్యోషి,రవిచారి,చంద్రశేఖరరావు,రాము సుబ్బారెడ్డి,వాల్మీకి పూజారులు,తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్‌లో ప్రతి అడుగూ పారదర్శకమే!

## నోటీసుల జారీ నుంచి విచారణ వరకు నిబంధనలు పాటించాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు జాబితాల సవరణను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,36,590 నోటీసులు జనరేట్ చేయగా, 60,959 నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో పాటు సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను సంబంధిత వ్యక్తికే వ్యక్తిగతంగా అందజేసి, అందుకు సంబంధించిన ఎకనాలెజ్‌మెంట్‌ను తప్పనిసరిగా రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు.

### ఓటర్లకు కనీసం ఏడు రోజుల గడువు:

నోటీసు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించుకునేందుకు కనీసం ఏడు రోజుల సమయం ఇవ్వాలని సీఈఓ స్పష్టం చేశారు. విచారణ తేదీకి రెండు రోజుల ముందుగానే మరోసారి సమాచారం అందించి, నిర్ణీత తేదీన విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పోలింగ్ కేంద్రాల వద్దే విచారణలు:

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా విచారణలను వికేంద్రీకృత విధానంలో నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు లేదా ఇతర అనువైన ప్రదేశాల్లో విచారణలు చేపట్టాలని తెలిపారు. అవసరమైతే పలు పోలింగ్ కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి విచారణలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

### పేరు తొలగింపునకు కారణం స్పష్టంగా ఉండాలి:

ఓటరు పేరు తొలగింపు లేదా ఇతర మార్పులకు సంబంధించిన నిర్ణయాలను స్పష్టమైన కారణాలతో కూడిన 'స్పీకింగ్ ఆర్డర్' రూపంలో జారీ చేయాలని సీఈఓ ఆదేశించారు. ఓటరు పేరు ముసాయిదా జాబితాలోకి వచ్చిన విధానం, అభ్యంతరానికి కారణం, సమర్పించిన పత్రాలు, విచారణలో వెల్లడైన అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తుది నిర్ణయానికి ముందు సంబంధిత రికార్డులను పలుమార్లు పరిశీలించి పూర్తి బాధ్యతతో నిర్ణయం తీసుకోవాలని, భవిష్యత్తులో అప్పీళ్లు వచ్చినా రికార్డుల ఆధారంగా నిర్ణయాన్ని సమర్థించుకునే విధంగా వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.




### డేటా ఎంట్రీపై అధికారుల నిఘా:

ఎన్యూమరేషన్ ఫారాల డేటా ఎంట్రీలో పొరపాట్లు జరిగితే నాన్-మ్యాపింగ్ కేటగిరీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సీఈఓ పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి దశలో నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

### రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలి:

క్లెయిమ్స్, అబ్జెక్షన్ల వివరాలను రోజువారీగా లేదా కనీసం వారానికి ఒకసారి సంబంధిత కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. అనామలీస్, నాన్-మ్యాపింగ్ కేటగిరీల వివరాలను సాధ్యమైన మేరకు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. విచారణకు హాజరయ్యే ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వడంతో పాటు అవసరమైన ఆధార పత్రాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విచారణల అనంతరం జరిగే అప్పీళ్ల ప్రక్రియకు కూడా సిబ్బందిని ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ లో నోటీసుల జారీ నుంచి స్వీకరణ, విచారణ, పత్రాల సమర్పణ, నిర్ణయం, స్పీకింగ్ ఆర్డర్ వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా భద్రపరచాలని సీఈఓ స్పష్టం చేశారు. ఒకే చిరునామాకు సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదవడం, వాస్తవంగా ఆ ప్రాంతంలో నివసించని వ్యక్తుల పేర్లు జాబితాలో ఉండటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

## - రాజీ మార్గమే రాజమార్గం - జిల్లా జడ్జి డి.రమాకాంత్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 29(ప్రజా జ్యోతి)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ గారి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం సెప్టెంబర్ నెలలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పై పోలీస్ ఉన్నతాధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి. రమాకాంత్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ మరియు చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హాజరై మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా లోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో సెప్టెంబర్ 12న,జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ బడుతుందని,ఈ లోక్ అదాలత్ లో భూతగాదా కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు,చెక్ బౌన్స్ కేసులు,కుటుంబ కేసులు, మోటారు వాహనాల ఆక్సిడెంట్ కేసులు,బ్యాంకు కేసులు,పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని,రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు.లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారంతో అప్పీల్ లేని తీర్పును పొంది సమయం,డబ్బును ఆదా చేసుకోవచ్చని లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలు సంతోశంతో జీవించవచ్చన్నారు.పగలు ప్రతీకారాలు పెంచుకోకుండా ఇరువర్గాలు రాజీచేసుకోవడంతో మానవ సంబంధాలు బలపడతాయని, సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ అనేది కేసులు త్వరగా పరిష్కరించుకోవడానికి గొప్ప అవకాశమని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ జడ్జ్ నసీమ్ సుల్తాన,సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిహారిక,శృతి దూత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్,ఎన్.శ్రీనిధి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్,పోలీస్ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు

## ప్రతి చుక్క నీటినీ ఒడిసిపట్టాలి.. ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌పై దృష్టి :

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, సాంకేతిక సిబ్బందికి గ్రామ పంచాయతీల అభివృద్ధి, మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై అవగాహన కల్పించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రణాళికల అమలులో నాణ్యత, పారదర్శకత, సమయపాలన పాటించాలని ఆదేశించారు.

**ప్రతి చుక్క నీటినీ ఒడిసిపట్టాలి :**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని మధుసూదన్ నాయక్ అన్నారు. ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో కురిసే ప్రతి చుక్క వర్షపు నీటిని సాధ్యమైనంత వరకు స్థానికంగానే నిల్వ చేసి భూగర్భ జలాలను రీచార్జ్ చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు ఫార్మ్ పాండ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అధికారులు అవగాహన కల్పించాలని, వాటి ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు.

**క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం:**

ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయించాలని అన్నారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి సర్పంచులు, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న పనులు, వాటి పురోగతి, ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని, మండల స్థాయిలో శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి:**

ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా పనిదినాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలంలో కూలీల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, కారణాలను విశ్లేషించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, కూలి చెల్లింపులు, ప్రభుత్వ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని మధుసూదన్ నాయక్ కోరారు. ఎంపీడీవోలు ప్రజలకు అత్యంత చేరువగా ఉండే కీలక అధికారులు కావడంతో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ముందుండి పనిచేయాలని సూచించారు.అంతకుముందు డీఆర్‌డీవో నరసింహులు మాట్లాడుతూ అన్ని శాఖల కన్వర్జెన్స్‌తో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శివానంద స్వామి, మత్స్యశాఖ డీడీ రాధారోహిణి తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న పనులపై అవగాహన కల్పించారు. ఆయా శాఖల పనులను కూడా గ్రామ పంచాయతీ ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు తదితర అధికారులు పాల్గొన్నారు.






# 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**నాగర్ కర్నూల్ : ఆగస్టు 29( ప్రజా జ్యోతి )**

నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు,సివిల్ సప్లై అధికారులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు.బల్మూరు మండలం తుమ్మలపేట గ్రామానికి చెందిన మల్లేష్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి నల్ల బజారుకు తరలిస్తుండగా పట్టుకున్నారు.డిప్యూటీ తహసిల్దార్ హేమ్లా నాయక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలో 60 బస్తాల రేషన్ బియ్యం, అశోక్ లేలాండ్ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## - మహబూబ్‌నగర్‌లో రెండు కేంద్రాలు.. భద్రత, ట్రాఫిక్, రవాణాపై ప్రత్యేక దృష్టి



**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్షకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష ప్రశాంతంగా, సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్, రవాణా, పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పరీక్ష ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, ఎలాంటి సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

### రెండు కేంద్రాల్లో పరీక్ష:

జిల్లా కేంద్రంలో ఫాతిమా హైస్కూల్, జెపిఎన్ ఇంజనీరింగ్ కాలేజ్లను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సహాయం, భద్రత తదితర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

### పోలీసు బందోబస్తు.. ట్రాఫిక్‌పై నిఘా:

ఫాతిమా హైస్కూల్ వద్ద డీఎస్పీ, జెపిఎన్ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద అదనపు ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో భద్రతతో పాటు అభ్యర్థుల రాకపోకలపై నిఘా ఉంచనున్నారు. అభ్యర్థుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్, బస్టాండ్, వన్‌టౌన్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను మోహరించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు.

### ఆర్టీసీ ద్వారా ప్రత్యేక రవాణా:

పరీక్షకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన రూట్లలో అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

### వైద్య బృందాలు, అత్యవసర మందులు సిద్ధం:

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రాథమిక వైద్య సహాయం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర మందులు, ప్రాథమిక వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు.

### విద్యుత్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు:

పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్ సదుపాయాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు.

### ఉదయం 7 గంటల నుంచే ప్రవేశం:

అభ్యర్థులను ఉదయం 7 నుంచి 8 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రధాన గేట్లు మూసివేయనున్నందున అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. భద్రతా తనిఖీలు, ఇతర పరీక్షా ప్రక్రియలకు తగినంత సమయం ఉండేలా ముందస్తుగా రావాలని కోరింది. అనుమతించని వస్తువులను భద్రపరిచేందుకు పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక స్టోర్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, వస్తువులు స్వీకరించిన అనంతరం టోకెన్లు జారీ చేసి పరీక్ష అనంతరం సురక్షితంగా తిరిగి అందించాలని కేంద్రాల సూపరింటెండెంట్లను ఆదేశించారు.

### రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో ' హెల్ప్ యూ ' కేంద్రాలు:

బయటి ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు మార్గదర్శకత్వం అందించేందుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో 10 మంది జీపీవో లు/సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. వీరు " హెల్త్ యూ నీట్ పీజీ-2026 ఎగ్జామినేషన్" ప్లకార్డులతో అందుబాటులో ఉంటారు.అభ్యర్థులకు పరీక్షా కేంద్రం వివరాలు, వెళ్లాల్సిన మార్గం, రవాణా సదుపాయాలపై సమాచారం అందించనున్నారు. అవసరమైన సందర్భాల్లో ద్విచక్ర వాహనాల ద్వారా కూడా మార్గదర్శకత్వం, సహాయం అందించేలా ఏర్పాట్లు చేశారు.

### అన్ని శాఖల సమన్వయంతో నిర్వహణ:

పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, మహిళా-శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

పరీక్ష పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అభ్యర్థులు కూడా పరీక్షా నిబంధనలు పాటిస్తూ ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన నారాయణపేట మైనారిటీ కళాశాల విద్యార్థి




**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 29( ప్రజా జ్యోతి)**

మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల (జూజు) బాలురు నారాయణపేటలో చదువుతున్న ఎండి అజీమ్,పీూజ మొదటి సంవత్సరం విద్యార్థి,ఈ నెల 21వ తేదీన నారాయణపేట జిల్లా స్థాయిలో జరిగినహై జంప్ పోటీలలో బంగారు పతకం సాధించి, ఈ నెల 26,27 తేదీలలో హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో హైజంప్ విభాగంలో వెండి పథకం సాధించి, జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.ఈరోజు జాతీయ స్పోర్ట్స్ డే సందర్భంగా కళాశాల అసెంబ్లీలో మేజర్ ధ్యాన్ చంద్ సింగ్ గారికి అలాశాల సిబ్బంది పుష్పాంజలి ఘటించి,ఈ విద్యాసంవత్సరంలో వివిధ క్రీడల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులకు పతకాలు అందజేశారు.అలాగే జాతీయ స్థాయికి ఎంపికైన ఎండీ అజీమ్ ను కళాశాల కోఆర్డినేటర్ మహమ్మద్ జహీరుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ వాకిటి విజయ్ కుమార్ మర్యు కళాశాల సిబ్బంది మెడల్ మరియు శాలువా తో సత్కరించారు.విద్యార్థులు క్రీడల్లో నేర్చుకున్న క్రమశిక్షణను జీవితంలో పాటిస్తూ, ఓటమిని ఎదురైనప్పుడు కుంగిపోకుండా అధిగమించి ముందుకెళ్లాలని, చదువులోనూ రాణించాలని లెక్చరర్లు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్ రెడ్డి, కాలేజీ కోఆర్డినేటర్ మహ్మద్ జహీరుద్దీన్, ఫీజికల్ డైరెక్టర్ వాకిటి విజయ్ కుమార్,మరియు కళాశాల అధ్యాపకులు , సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారులకు చేయూత సాయం చేయడం

# క్రీడాకారుల ప్రతిభను గుర్తించడం గొప్ప విషయం

## జాతీయ క్రీడా దినోత్సవం క్రీడల ప్రాధాన్యతను చాటిన సామాజిక కార్యకర్త అబ్దుల్ మునీర్ కు ప్రత్యేక అభినందనలు










**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సామాజిక కార్యకర్త అబ్దుల్ మునీర్ సొంత ఖర్చుతో ఉట్కూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు రీజనింగ్ మ్యాట్, సెటిల్ కిట్ పంపిణీ చేశారు అనంతరంఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ ప్రజాప్రతినిధులు ఉప సర్పంచ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ ఉట్కూర్ సర్పంచ్ ఉప రేణుక భరత్ ఉప సర్పంచ్ రమేష్,, ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిజంగా సేవ చేయడం అందరికీ సాధ్యం కాదని ముఖ్యంగా యువజన క్రీడాకారులకు ఇలాంటి మద్దతు సపోర్ట్ చేయడం నిజంగా గొప్ప విషయమని అన్నారు, జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ.హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని,జరుపుకుంటున్నామని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి, క్రమశిక్షణకు దోహదపడతాయని ఆయన అన్నారు.ప్రతి విద్యార్థి చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చదువులోనే కాకుండా క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని. క్రీడాకారులకు విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది క్రీడాకారులకు సరైన వేదిక, ప్రోత్సహం లేక వెనుక పడిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.నేటి యువత మొబైల్ ఫోన్లకు అతుక్కు పోకుండా మైదానాలలో ఇష్టమైన క్రీడాలు ఆడుకుంటూ ఉండాలని సూచించారు.పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం, ఉపకారనాలు, ఆర్థిక సాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.చదువుకుంటున్న పేద విద్యార్థులకు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.విద్యార్థులకు చదువుల నిమిత్తం, క్రీడాకారులకు సహకరించడం, సామాజిక సేవ చేయడం తన కర్తవ్యంగా సామాజిక కార్యకర్త అబ్దుల్ మునీర్ ముత్తుకూరు ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని వారందరూ ప్రత్యేకంగా అబ్దుల్ మునీర్ ను అభినందించారు.. సందర్భంగా అబ్దుల్ మునీర్ మాట్లాడుతూప్రజలకు సేవ చేయడమే దేవుడిచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తానని, తనకు పేరు ముఖ్యం కాదు, నిరంతరం ప్రజల సేవ చేస్తూ ముందుకు సాగడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల బృందం అబ్దుల్ మునీర్ కు శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్. సీనియర్ క్రీడాకారుల జగదీష్ గౌడ్. పాఠశాల పి టిలు, ఉపాధ్యాయ బృందం. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు